క్లుప్తంగా

పార్టీ అభ్యున్నతికి కృషి చేయండి



రఘుపతిరాజును అభినందిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పదవులు అలంకరించిన వారు పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌టీయూ జిల్లా కార్యదర్శిగా నియమితులైన రఘుపతిరాజు శనివారం డాక్టర్ సునీల్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘుపతి రాజును అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు షాకీర్, సుహేల్, నాగభూషణం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగి పడిన చెట్టుకొమ్మ



పుంగనూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మ

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం చెట్టు కొమ్మ విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎల్‌ఐ కుమార్ అక్కడకి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుందని, ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే పాఠశాల కూడా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖాధికారులు దృష్టిలో వుంచుకుని రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

15న గుడివంక ఆలయ అంగళ్ల గేటు వేలం

గుడుపల్లె: గుడివంక శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా అంగళ్ల గేటు వసూలుకు ఈ నెల 15వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్టు ఈవో కమలాకరన్ తెలిపారు. ఆగస్టు నెల 11 నుంచి16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో అంగళ్ల గేటు, లడ్డు ప్రసాదం విక్రయం, తలనీలాలు పోగుచేసుకునే హక్కును పొందడానికి వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు



భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోవున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి శనివారం అఖండ భజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం స్వామి వారి భజనలతో మారుమోగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలుగా ప్రతి శనివారం భక్తులతో అఖండ హరినామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు పట్టణ ప్రముఖులు, భక్తులు, దాతలు చందాల రూపంలో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు.

వాటర్ ప్లాంట్‌లో నీరు కలుషితం



బిందెలోని నీటిలో వున్న పురుగులు

చౌడేపల్లె: ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందజేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో నీటిని పట్టుకుని వెళ్లిన ప్రజలకు చేదు అనుభవం ఎదురైంది. నీటిని క్యాన్లు, బిందెల్లో తీసుకుని ఇంటికెళ్లి చూడగా మలినాలతో కూడిన పురుగులను గుర్తించారు. తాగునీటి కలుషితం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నామని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడని వాపోతున్నారు. అధికారులు స్పందించి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి



చెరువు మట్టిని పాలంలో వేస్తున్న రైతు



జేసీబీతో చెరువు మట్టిని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

పంటలు పండే భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం, వర్షపు నీటిని గ్రహించే సామర్థ్యం తగ్గుతుండడంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు చెరువు మట్టిని పొలాలకు విరివిగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటిపోయింది. ఆయా చెరువుల్లోని మట్టిని పంటలు సాగు చేసే భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- రసాయన ఎరువుల్లో ఉండే పోషకాల లభ్యం
- భూసారం పెంపుతో పాటు అధిక దిగుబడులు
- చెరువు మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించేందుకు మట్టి పరీక్షలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఐరాల: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల్లో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం హరించుకుపోతుంది. దానికితోడు భూమిలోని సారం కోల్పోయి విషతుల్యం అవుతోంది. అందువల్ల చెరువు మట్టి పొలాల్లో వేస్తే చాలావరకు మేలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మట్టి తరలిస్తే అనుకూలం

మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోయాయి. ఎండిన చెరువుల్లో 2 అడుగుల నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. జేసీబీలు, ట్రాక్టర్లతో తుక్కువ ఖర్చుతో రైతులు మట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. తర్వాత నాగలితో పాటు రొటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంటసాగుకు అనుకూలంగా మారుతుంది.

మట్టి సేకరణ విధానం

చెరువు మట్టి పూడికస్థాయి, లోతు, విస్తీర్ణం గమనించాలి. దాన్ని తీయడం వల్ల చెరువుకు ఉపయోగం ఉందా లేదా అని గమనించాలి. చెరువు మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించేందుకు మట్టి పరీక్షలు చేయించాలి. ఈ పరీక్షల్లోనే ఆ మట్టిలోని రసాయన అవశేషాల స్థాయిని కూడా తెలుసుకోవాలి.

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తయిన ప్రదేశాల నుంచి వర్షపు నీటితోపాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రుమట్టి, వివిధ పాళ్లలో కుళ్లి వ్యర్థ పదార్థాలతో కలిసి చెరువులోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు సూక్ష్మపోషకాలు ఉంటాయి. చెరువు మట్టి వల్ల పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి, అధిక దిగుబడులు సాధించవచ్చు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది. విలువైన సేంద్రియ కర్బన పదార్థం అందించడం వల్ల మొక్కలు నీటి ఎద్దడిని కూడా తట్టుకుని దిగుబడులు ఇస్తాయని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి తెలిపారు. చెరువు మట్టి వేసిన పంటల్లో దిగుబడులు ఆశించిన మేర వస్తాయని పరిశోధనల్లో వెల్లడైనట్లు వివరించారు.

ప్రయోజనాలు ఇలా..

చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు. నేల గుల్లబారుతుంది. మురుగు నీటి పారుదల మెరుగవుతుంది. సూక్ష్మ, స్థల పోషకాల స్థాయిలు పెరుగుతుంది. ముఖ్యంగా నత్రజని స్థాయిలు పెరుగుతాయి. మట్టితోపాటు సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. ఈ మట్టితో సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలలో గాలి పరిమాణాన్ని పోషకాలను పెంచుతాయి. అన్ని రకాల పోషకాలను అందిస్తూ దీర్ఘకాలికంగా పంట పొలం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. ప్రతి పంటలోనూ అధిక దిగుబడులు సాధించవచ్చు.

వివరాలు

రైతులు	:	20 వేల మంది
సాగు విస్తీర్ణం	:	13,420 ఎకరాలు
మెట్ట పంటలు	:	9,240 ఎకరాలు
నీటి తడులు అవసరమైన పంటలు	:	4000 ఎకరాలు
బీళ్లుగా ఉండే భూములు	:	280 ఎకరాలు

ప్రధానంగా సాగయ్యే పంటలు

మామిడి, వేరుశనగ, వరి, పశుగ్రాసం, కంది, అలసందలు, కూరగాయలు,

పూల తోటలు

మండలంలో చెరువులు సంఖ్య	:	72
పెద్ద చెరువులు	:	బీరప్ప చెరువు, వేదగిరివారిపల్లె చెరువు

అవగాహన కల్పిస్తున్నారు



చెరువు మట్టి పొలాల్లో వేసుకోవడం వల్ల కలిగే లాభాలను వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం మా పొలాల్లో చెరువు మట్టి పోసుకుంటున్నాం. చెరువు మట్టితో అధిక దిగుబడులు సాధించవచ్చు. గుల్లబారిన భూమిలో మొక్కలు లోతుగా చొచ్చుకుపోతాయి. ఈ మట్టి మూడేళ్ల వరకు పనిచేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

–దీపక్, రైతు, రెడ్డివారిపల్లె, ఐరాల

మూడేళ్లుగా చెరువు మట్టి తరలిస్తున్నాం



పొలాల్లో చెరువు మట్టిని ఉపయోగిస్తూ పంటలను సేంద్రియ పద్ధతుల్లో పండించికోవచ్చు. రసాయన ఎరువులకు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పంటలు పండించుకునే వీలుంటుంది. వర్షాధార నేలల్లో వీటిని ఎక్కువగా వేస్తుంటారు. గత మూడేళ్లుగా పొలాలకు చెరువు మట్టిని తరలిస్తున్నాం. దీంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి.

–సుధాకర్‌నాయుడు, రైతు, ఎగువకామినాయనపల్లె, ఐరాల

రైతులు చెరువు మట్టిని వేసుకోవాలి



చెరువు మట్టిలో రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలన్నీ సమృద్ధిగా లభిస్తాయి. అవకాశం ఉన్నంత వరకు చెరువు మట్టిని రైతులు పంట పొలాలకు వినియోగించడం మంచిది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువులు అడుగంటాయి. విరివిగా మట్టి లభ్యమవుతున్న దృష్ట్యా పొలాలకు వినియోగించుకుంటే అధిక దిగుబడులు పొందేందుకు వీలుంటుంది.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

యూనివర్సిటీ హామీ ఎప్పుడు నెరవేరుస్తారు ?

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు హామీ ఎప్పుడు నెరవేరుస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ టిక్కి రాయల్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకు ఆ హామీ నెరవేర్చకపోవడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెంటనే గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లోకేష్, ప్రధాన కార్యదర్శి సెల్వం, బీసీ సెల్ అధ్యక్షులు దొరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తిరిగితే సమస్యలు తెలుస్తాయి



మిట్టూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య

చిత్తూరు కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎక్కువగా తిరగాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. శనివారం మిట్టూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. నిత్యం క్షేత్రస్థాయిలో తిరుగుతుంటే సమస్యలు తెలుస్తాయన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తుంటే సమస్యలు తగ్గుతాయన్నారు. అంతరాయాలు పెరుగుతున్నాయని వాటిని నివారణకు కృషి చేయాలన్నారు. విధిగా నిర్వహణ పనులు చేస్తుంటే సమస్యలు రావన్నారు. ట్రీకటింగ్, లైన్, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేస్తే అంతరాయాలు ఉండవన్నారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు వందశాతం వసూళ్లకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజనాలబండలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో వెలసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ చోరీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానితులు రాజనాలబండకు చేరుకున్నారు. అర్చకులు వారితో ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రాజనాల బండ భక్తులతో సందడి నెలకొంది. అలాగే దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లెలోవున్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి మాలాధారణ ధరించిన భక్తులు శ్రీరామ, హనుమాన్ నామస్మరణాలతో గీతాలాపన చేశారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇంకెప్పుడు ?

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇంకెప్పుడిస్తుందంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, దాములు ప్రశ్నించారు. ఈ మేరకు వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉన్నత విద్య నిర్వీర్యం అవుతోందని విమర్శించారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం మండలాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేశారన్నారు. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వింత పోకడలు అమలు చేయడం సబబు కాదన్నారు. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని వెంటనే తొలగించాలన్నారు. డబుల్ మేజర్ సబ్జెక్ట్స్ విధానం తీసుకొస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం కొద్ది రోజులకే మాట మార్చి తిరిగి సింగిల్ సబ్జెక్ట్ విధానం అమలు చేయడం దారుణమన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అనే అంశంపై వెంటనే తెలియజేయాలన్నారు. ఉన్నత విద్య పట్ల గందరగోళంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. ఇంటర్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు జరగకపోవడం అన్యాయమన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో నెల క్రితమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

వైభవం.. శ్రీరాముడి రథోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన టి.పుత్తూరు
- వేలాది మంది భక్తులకు అన్నదానం
- ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాముడి రథం(ఇన్‌సెట్‌లో)



భక్తజనసందోహం నడుమ సాగుతున్న శ్రీరాముడి రథోత్సవం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాముడి రథోత్సవం భక్తజనసందోహం నడుమ అంగరంగ వైభవంగా సాగింది. భక్తులతో గ్రామమంతా రామనామస్మరణతో మార్మోగింది. స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి పలు సాంస్కృతి కార్యక్రమాలు, కళాకారులు ప్రదర్శించిన దేవతామూర్తుల వేషధారణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులతో స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, మధ్యాహ్నం ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

కోదండరాముడి రథోత్సవాన్ని తిలకించడానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు కోదండరాముల స్వామి అన్నదాన ట్రస్టు ద్వారా అన్నదానం చేశారు. అన్నదాన ట్రస్టు చైర్మన్ జింకట రామచంద్రారెడ్డి, సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భోజనాలు పెట్టారు.

రామనామస్మరణతో రథోత్సవం

కోదండరామాలయంలో శనివారం సాయంత్రం శ్రీరాముడి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి నేతృత్వంలో కార్యనిర్వాహకులు, గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామివారికి గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, పూజాసామగ్రి, ప్రసాదాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం భక్తుల రామనామస్మరణ నడుమ రథం ముందుకు సాగింది. రథోత్సవంలో ఊరేగింపుగా వచ్చిన శ్రీరామచంద్రుడికి భక్తులు ఇంటింటా పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ, కర్పూర హారతి సేవ చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేవతామూర్తుల వేషధారణ భక్తులను అలరింపజేశాయి. రాత్రి కురవంజి వీధి నాటకాన్ని తమిళంలో కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు.

నేడు అశ్వవాహన సేవ

కోదండరామాలయంలో ఆదివారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, ఉత్సవం, సాయంకాలం ఊంజల్‌సేవ, అశ్వవాహన సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్యధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.



కోదండరామాలయంలో స్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



భక్తులకు అన్నదానం

గణిత అవధాని సేవలు ఎనలేనివి



గణిత అవధాని అరుణశివప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు గణిత అవధాని అరుణశివప్రసాద్ అందిస్తున్న సేవలు ఎనలేనివని బృందావన్ పాఠశాల చైర్మన్ శైలజా కుమారి అన్నారు. శనివారం నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ సీబీఎస్ఈ పాఠశాలలో ఆయనకు సన్మానం చేశారు. శైలజా కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గణిత అవధానంలో నిష్ణాతులు చేయడం గొప్ప విషయమన్నారు. అందుకోసం గణిత ఉపాధ్యాయులు, అవధాని అరుణశివప్రసాద్‌కు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లభించడం అభినందనీయమన్నారు. ఏపీ గణిత ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నాలుగు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులు సాధించడం గొప్ప విషయమన్నారు. ఏపీ గణిత ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ భవిష్యత్ భారతావనికి గణిత శాస్త్రవేత్తలను అందించడంలో అరుణశివప్రసాద్ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. 40 మంది విద్యార్థులను అవధానులుగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆయనకు శాలువ కప్పి, సత్కరించారు. కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజ, బృందావన్ పాఠశాల డైరెక్టర్ ప్రియ, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రం నాయుడు తదితరులు పాల్గొన్నారు.